

వరద బాధితులకు సాయం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో సంభవించిన వరదలకు వేలాది ఇళ్లు దెబ్బతిని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ద్వారా సాయమందించాలని కోరారు. ఆన్‌లైన్‌లో సాయం చేయాలనుకునే వారు Ac No : 142710011000121, IFSC Code : UBIN0814270, District Collectorate Branch, Srikakulam బ్యాంకు ఖాతాకు చెక్కుల రూపంలో గానీ, నగదు రూపంలో గానీ చెల్లించాలని కోరారు. హెల్ప్ డెస్క్ 9133008585, 9010273741, 9948633398 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యథేచ్ఛగా ఇసుక దందా

- కాఖండ్యాం స్టాక్ యార్డు వద్ద విశాఖ లారీలు దర్శనం
- తరలిపోతున్న ఉచిత ఇసుక
- ఆకులతంపర నుంచీ విశాఖకే...
- కూటమి ప్రజాప్రతినిధుల హస్తమున్నట్లు ఆరోపణలు



జిల్లాలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా సాగుతోంది. అనధికార రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలు చేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్లనే అక్రమాలకు వేదికగా మార్చుకుంటున్నారు. టన్నుల కొద్దీ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక స్టాక్ పాయింట్‌కు ఈనెల ఒకటో తేదీన విశాఖ జిల్లా రిజిస్ట్రేషన్‌తో ఉన్న లారీలు లోడింగ్‌కు రావడం అక్రమాలకు అద్దం పడుతోంది. అధికార కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేల ఒత్తిడితోనో, ప్రలోభాలకు గురయ్యో పోలీసు, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం కాఖండ్యాంలో అధికారులు ఇటీవల ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కాఖండ్యాం పాయింట్‌లో లభ్యమైన ఇసుకను సమీపంలోని మామిడివలస సచివాలయంలో గత నెల 31వ తేదీ నుంచి అమ్మకాలు ప్రారంభించారు. వాహనం రకం బట్టి ఇసుకను అందజేసేలా పరిమితులు విధించారు. ట్రాక్టర్‌పై తరలింపునకు ఐదు టన్నులు, ఆరు చక్రాల లారీకి పది టన్నులు, పది టైర్ల లారీకి 30 టన్నులు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక ఆధార్ కార్డుపై రోజుకు ఒకసారి మాత్రమే అందించాల్సి ఉంది. అదీ ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఇసుక అందజేయాలని నిబంధనలు చెప్తున్నాయి. కాఖండ్యాం స్టాక్ పాయింట్‌లో ఈ నిబంధలేవీ అమలు కావడం లేదని తెలుస్తోంది. రాత్రి తొమ్మిది గంటల వరకు ఇసుక పంపిణీ సాగుతున్నట్లు గ్రామస్తులు చెప్తున్నారు. ఒక ఆధార్ కార్డుపై లెక్కకి మించి ఇసుక అందిస్తున్నట్లు ఆరోపణలు వినివస్తున్నాయి. నీలంపేటకు చెందిన కోడె గోవిందరావు అనే వ్యక్తికి ఈ ఒకటో తేదీన ఏకంగా తొమ్మిది సార్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. అదీ ఒకే డిడితో తొమ్మిది సార్లు ట్రాక్టర్‌తో తరలించినట్లు గ్రామస్తులు చెప్తున్నారు.



కాఖండ్యాం యార్డు వద్ద విశాఖకు చెందిన ఇసుక లారీ (ఫైల్)

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విశాఖ లారీలు

కాఖండ్యాం ఇసుక స్టాక్ పాయింట్ నుంచి జిల్లా అవసరాలకే వినియోగించాల్సి ఉండగా, విశాఖ జిల్లాకు పంపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులో రాయడం మాత్రం జిల్లా లేదా మండలంలోని మరో గ్రామానికి తరలిస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. లారీల్లోకి ఇలా లోడ్ చేసిన ఇసుకను విశాఖకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. లారీ ఇసుకను రూ.38 వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. కాఖండ్యాం పాయింట్ నుంచి ఇసుక తరలింపునకు ఈనెల ఒకటో తేదీన వచ్చిన రెండు లారీలు విశాఖ జిల్లాకు చెందినవి కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఇసుకను జిల్లావాసులే వినియోగిస్తే, ఇక్కడ లారీలను బుక్ చేసుకుంటారు తప్ప అక్కడ్నుంచి లారీలు ఎందుకు తీసుకొస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా?

అధికారుల పర్యవేక్షణలోనే ఇసుక పాయింట్ నుంచి ఉచిత ఇసుక అందజేత జరుగుతున్నా, అక్రమాలపై ఆరోపణలు రావడం అనేక సందేహాలకు తావిస్తోంది. కూటమికి చెందిన నియోజకవర్గ ప్రతినిధి ఒకరు ఇసుక తవ్వకాల విషయంలో ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో మండలానికి చెందిన ఒక రెవెన్యూ అధికారి ఇటీవల నారాయణపురం నుంచి కొల్లివలస రోడ్డులో మూడు ఇసుక లారీలను పట్టుకోవడంతో ఆ నేత గుర్రుగా ఉన్నట్లు ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ అధికారిని మండలం నుంచి పంపేయాలని చూస్తున్నట్లు ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది.

ఆకులతంపరలో అలా...

కొత్తూరు మండలం ఆకులతంపర ఇసుక అక్రమ తవ్వకాల వెనుక అధికార పార్టీ నేతల హస్తమున్నట్లు తెలుస్తోంది. అదే మండలం అంగూరులో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా ఇసుకను అందజేసేవారు. అక్కడ ఇసుక నిల్వలు అయిపోవడంతో పంపిణీ ఆపేశారు. దీంతో పక్కనే ఉన్న ఆకులతంపరలో అక్రమంగా ఇసుక తవ్వకాలకు తెరలేపారు. లారీల్లోకి ఇసుక లోడింగ్ చేసి విశాఖకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లారీ ఇసుకను రూ.30 వేలకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. రోజుకు 60 నుంచి 70 లారీల్లో ఇసుకను పంపిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గానికి చెందిన కూటమి ప్రజాప్రతినిధి ప్రమేయం ఉందన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. నియోజకవర్గ టిడిపిలో నెలకొన్న గ్రూపుల పోరు నేపథ్యంలో ఇవి బయటపడినట్లు తెలుస్తోంది. అప్పటికే వారం రోజుల కిందట నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు గ్రామస్తులు చెప్తున్నారు. జిల్లా సరిహద్దులు దాటుతున్నా రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి తెలియకపోవడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కఠినంగా వ్యవహరించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టాలని అంతా కోరుతున్నారు.

వర్ష నష్టంపై నివేదికలు ఇవ్వాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాయుగుండం కారణంగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో ఎక్కడైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు, పంటలకు నష్టం వాటిల్లితే వెంటనే నివేదించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 306 హెక్టార్లలో పంట నష్టం, నీటిపారుదల శాఖ పరిధిలో రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోయిన కారణంగా ఇపిడిసిఎల్‌కు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. నాలుగు ఇళ్లు, రెండు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. కంటెంప్ట్ కేసులు కోర్టులో నమోదైన వెంటనే చొరవ తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన కోర్టు కేసులను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. అలసత్వం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి శాఖ వారి పరిధిలోని కోర్టు కేసుల జాబితాను తయారు చేసుకోవాలని, ప్రతి కోర్టు కేసుకు సంబంధించి ఈ-ఆఫీస్ ఫైలు ఉండాలని స్పష్టం చేశారు. కోర్టు కేసుల గురించి ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని, బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి విచారణ చేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందని, ఈలోగా పంట వివరాలు నమోదు చేయాలన్నారు. ఎరువుల కొరత అనే మాట వినిపించరాదన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, అక్టోబర్ రెండో తేదీ నాటికి అన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. జిల్లాలో జ్వరాలు అదుపులోకి రావకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. డెంగీ కేసులు నమోదు కారాదని, రోగ నిర్ధారణకు అవసరమైన కిట్లు కొనుగోలు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, జెడ్‌పి సిఇఒ ఎం.వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల జెడిలు కె.శ్రీధర్, జయరాజ్, ఉద్యానవన శాఖాధికారి ప్రసాద్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు పిఎం ఉపకార వేతనం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని మాజీ సైనికులు, వితంతు మాజీ సైనికుల పిల్లలకు 2024-25 విద్యా సంవత్సరానికి గానూ వృత్తి విద్యా కోర్సుల్లో మొదటి ఏడాది చదువుతున్న వారికి ప్రధానమంత్రి ఉపకార వేతనం పొందడానికి కేంద్రీయ సైనిక బోర్డు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు పొందిన వారికి ఈ పథకం కింద విద్యార్థికి నెలకు రూ.2,500, విద్యార్థినికి నెలకు రూ.మూడు వేలు చొప్పున ఉపకార వేతనం మంజూరు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయాన్ని గానీ 8688817943 ఫోన్ నంబర్‌ను గానీ సంప్రదించాలని కోరారు.

అవగాహనతోనే నేరాల నియంత్రణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద్

అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమని డిఎస్‌పి సిహెచ్ వివేకానంద్ అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్లో మహిళా పోలీసులతో మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులు, పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులు కదలికలు, మద్యం, గంజాయి, నాటుసారా క్రయ విక్రయాలు, వినియోగం, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని అందించాలన్నారు. గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో అల్లర్లు సృష్టించే వ్యక్తులను ముందస్తుగా గుర్తించి సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నేరాల నియంత్రణ కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా వ్యవహరించి ప్రజా రక్షణకు, మహిళల భద్రతకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు గంజాయి అమ్మే వ్యక్తులను గుర్తించాలన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నిరోధించడానికి, శాంతిభద్రతల పరిరక్షణలో చురుగ్గా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి పాటుపడాలని దిశానిర్దేశం చేశారు.

ఆన్‌లైన్ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఒకటి, రెండో పట్టణ సిఐలు కె.పైడిపునాయుడు, వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఒఎల్‌ఎక్స్, గిఫ్ట్ ఆఫర్ అంటూ ఆశ చూపి సైబర్ నేరగాళ్లు చేసే అనేక రకాల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 1930 టోల్ ఫ్రీ నంబరును ప్రచారం చేసి సైబర్ నేరాలపై ఫిర్యాదులు చేసేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారాం, ఎస్ఐలు కృష్ణప్రసాద్, వాసుదేవరావు, కృష్ణారావు, సబ్ డివిజన్ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం'లో నూతన మెనూ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా నూతన మెనూను ప్రవేశపెట్టనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంపై శ్రీకాకుళం డివిజన్‌లో ఎంపిక చేసిన ఎంఇఒలు, హెచ్‌ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, వంట కార్మికులతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న మెనూను మెరుగుపరచడానికి వీలుగా వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల ఆవరణలో న్యూట్రీగార్డెన్ పెంచడం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకట ధన బాలాజీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకట ధన బాలాజీ తెలిపారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో పరిపాలనాధికారి ముని రామకృష్ణతో కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెస్‌ను సందర్శించి ఆహార తయారీకి వాడే పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెస్ కమిటీతో సమావేశం నిర్వహించి నాణ్యమైన ఆహారం అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ మోహన్‌కృష్ణ చౌదరి, చీఫ్ మెస్ కోఆర్డినేటర్లు వి.సోమిబాబు, ఆర్.మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఆశావర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు



కొత్తూరు : ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, నాయకులు ఎన్.మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని పిహెచ్‌సిల్లో ఆశా డే సమావేశాలను మంగళవారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశాలు అక్కుపల్లి పిహెచ్‌సి వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఆందోళన అనంతరం గత ప్రభుత్వం వేతనాల పెంపుదలకు, గ్రాట్యుటీ, పింఛన్ వంటి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. దానికి సంబంధించిన జిఒలు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విడుదల చేయలేదని చెప్పారు. అధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు న్యాయం చేస్తామని టిడిపి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, మోహిని, భారతి, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని తాడివలస, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం వైద్యాధికారులు నవీన్ నాగ పవన్‌కళ్యాణం, శివశంకర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మణికుమారి, రామలక్ష్మి, కళ్యాణి, సునీత, భవాని తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కురిగాం పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.గౌరమ్మ, కె.జ్యోత్స్న, పి.జయమ్మ, ఎల్.కామాక్షి తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



పొందూరు : వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

పంట నష్టం వాటిల్లకుండా చర్యలు

ప్రజాశక్తి - పోలాకి



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పంట నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. మండలంలోని సుసరాం, పిరియాగ్రహారం, దండులక్ష్మీపురం, గుల్లవానిపేట, గుప్పెడపేట ముంపు ప్రాంతాలను రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో సుసరాం తంపర భూముల సమస్యలు పరిష్కరించేందుకు అప్పటి టిడిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టిందన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక పనులు చేపట్టకపోవడంతో వర్షాలకు తంపర భూములు మునిగిపోతున్నాయని చెప్పారు. శాశ్వత పరిష్కారానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వంశధార డిఇ శ్రీహరి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, కూటమి నాయకులు తమ్మినేని భూషణరావు, డోల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌ఎన్‌పేట : ఈనెల 5, 6, 7 తేదీల్లో తుపాను నేపథ్యంలో ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎం.కిరణ్ అన్నారు. తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించాక బాధపడడం కంటే ముందుజాగ్రత్త చర్యలతో ప్రమాద బారిన పడకుండా ఉండడం మంచిదన్నారు. వర్షాకాలంలో జ్వరాలు, డయేరియా ప్రబలే అవకాశాలు ఉంటాయని, వరదలతో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు, వేడి భోజనం, చేతులు కడుక్కోవడం, మరుగుదొడ్ల, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఇఒఆర్‌డి, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలతో ఎపి ఎన్‌జిఒ భాగస్వామ్యం

- ఉద్యోగుల సమస్యలపై ఉద్యమాలు
- ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధికారంలో ఉన్న ప్రభుత్వాలతో భాగస్వామ్యమవుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ముందుంచుతుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు తెలిపారు. నగరంలోని గొంటివీధిలో గల ఆయన నివాసంలో 63వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఎన్‌జిఒ అసోసియేషన్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సంఘానికి రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలతో ఉద్యోగ సంఘాలు కలిసి పనిచేస్తాయని చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడు ఆ సంఘాలకు ఇబ్బందులు ఎదురవుతుంటాయని, రాష్ట్రంలో మాత్రం తాము తటస్థంగా ఉంటామన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని, అందుకే ఎవరు అధికారంలో ఉన్నా వారితో భాగస్వామ్యం కావాల్సిందేనన్నారు. ఉద్యోగులకు వ్యతిరేక నిర్ణయాలు చేసినప్పుడు ప్రభుత్వాలతో పోరాటం తప్పదన్నారు. 39 ఏళ్ల సర్వీసులో వాణిజ్య పన్నులశాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్నాని, తన శాఖతో పాటు అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల సహకారంతోనే ఎన్‌జిఒ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాయనన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31న తాను ఉద్యోగ విరమణ చేస్తున్నట్లు చెప్పారు. ఆరోజు విజయవాడలో, జనవరి 5న జిల్లాలో ఉద్యోగ విరమణ వేడుక నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్, రాయి వేణుగోపాల్, బి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పురుషోత్తం నాయుడు


చెక్కును అందజేస్తున్న నాయకులు

ఎన్‌సిఎల్ కార్మికుల ఔదార్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని చిలకపాలెం వద్ద ఉన్న నాగార్జున అగ్రికెం కార్మికులు, ఉద్యోగుల ఔదార్యాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌ఆర్‌హెడ్ కె.శ్యాంప్రసాదరావు అభినందించారు. నాగార్జున అగ్రికెం పరిశ్రమలో పనిచేసిన లింగాల సన్యాసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుటుంబానికి ఎన్‌సిఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా వసూలు చేశారు. ఆ మొత్తాన్ని పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మృతుని భార్య ఈశ్వరమ్మ, కుమారుడు వరద రాజులకు చెక్కును యాజమాన్య ప్రతినిధులు, సిఐటియు, యూనియన్ నాయకులు అందజేశారు. ఒకరోజు వేతనంతో పాటు గ్రాట్యుటీతో కలుపుకొని రూ.12,43,125 అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులుగా పనిచేస్తూ ఏ ఒక్కరు మృతి చెందినా తమతో పాటు పనిచేస్తున్న కార్మికులంతా ఒకరోజు వేతనం ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. దీంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థికభరోసా ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెం వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, పి.నాగేశ్వరరావు, సిహెచ్.సత్యనారాయణ, జె.సూకరాజు, పి.చిన్న, కె.అప్పన్న, సుధాకర్ పాల్గొన్నారు.

16 ఏళ్లయినా పూర్తి కాని 'ఆఫ్‌షోర్'

నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాలకుల నిర్లక్ష్యం కారణంగా 16 ఏళ్ల గడచినా ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయకపోవడం అన్యాయమని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగారావు సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తిచేస్తారో టిడిపి కూటమి ప్రభుత్వానికి స్పష్టత లేక పోవడంతో రైతాంగం ఆవేదన చెందుతున్నారన్నారు. 2008లో జలయజ్ఞంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టిందన్నారు. పనులు ప్రారంభించి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటి పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. తక్షణమే ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విశాఖలో పింఛను అందజేత

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పాడియాపుట్టుగకు చెందిన పొడియా భూదేవి, పాడియా సరస్వతి విశాఖపట్నంలో విజేత ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. దీంతో వీరిద్దరూ సెప్టెంబరు నెలలో తాము తీసుకునే వికలాంగ, విడో పింఛను అందుకునే స్థితిలో లేరు. విషయం తెలుసుకున్న కవిటి-3 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం విశాఖపట్నం చేరుకుని వారికి పింఛను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ వీరభద్ర స్వామిలు ఖాదర్‌ను అభినందించారు.


పింఛను అందజేస్తున్న ఖాదర్

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ స్పీకర్ సీతారాం


పొందూరు : చెక్కును అందజేస్తున్న సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

విశాఖపట్నం అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో గత నెలలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను వైసిపి అండగా ఉంటుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ అనే వ్యక్తి సెజ్ ప్రమాదంలో చనిపోయారు. ఆ కుటుంబానికి వైసిపి తరుపున రూ.5 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఆర్థికసాయం అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, కోట గోవిందరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బడాన సునీల్, జిల్లా మహిళా కన్వీనర్ కూన రవణమ్మ, చింతాడ రవి పాల్గొన్నారు.

నౌపడ : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మండలంలోని చెట్లతాండ్రకు చెందిన పంగ శ్రీనివాసరావు గాయపడ్డాడు. ఈయన వైద్య ఖర్చులకు వైసిపి తరుపున నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ రూ.లక్ష చెక్కును మంగళవారం అందజేశారు. గాయాల నుంచి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మాజీ సిఎం జగన్ ఆశిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నందిగాం, కోటబొమ్మాళి ఎంపిపిలు ఎన్.శ్రీరామ్మూర్తి, రోణంకి ఉమామల్లేశ్వర రావు, వైసిపి నాయకులు పంగరామయ్య, పంగ అప్పన్న, మార్పు నాగభూషణరావు, పి.రామకృష్ణ, కొన్న శ్రీరాములు, కళింగపట్నం నాగరాజు, జి.చంద్రరావు, సుబ్బారావు, అన్నెపు రామారావు, చిన్ని జోగారావు పాల్గొన్నారు.


నౌపడ : చెక్కును అందజేస్తున్న తిలక్

మురుగు కాలువను నిర్మించాలి



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

ప్రజాశక్తి- కొత్తూరు

కొత్తూరులో మురుగు నీటి కాలువ నిర్మాణం చేట్టాలని సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డులో ఆర్‌అండ్‌బి కల్వర్టును అక్రమార్కులు మూసివేశారని అన్నారు. దీంతో ఐదేళ్లుగా స్థానికులు వినియోగిస్తున్న మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి చేరి నిల్వ ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డు గుంతలమయమైందన్నారు. ఆ ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలోకి గతంలో వరద నీరు, మురుగునీరు చేరడంతో దానిని మూసివేసి వేరేచోటకు తరలించారని గుర్తుచేశారు. ఐదేళ్లుగా నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేసినా, పలువురికి వినతిపత్రాలు అందజేసినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నిరసనకారులపై, ప్రజలపై పోలీసులు తప్పడం కేసులు నమోదు చేసి నోటీసులు ఇచ్చారని అన్నారు. కానీ, ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో 'పద్మావతి' ఒప్పందం

నరసన్నపేట : అంతర్జాతీయ విద్యా సంస్థ లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో పద్మావతి డిగ్రీ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. కళాశాల ఆవరణలో లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ప్రతినిధి మహేంద్ర లంకా మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన, అంతర్జాతీయ భాషానైపుణ్య పరీక్షలైన టోఫెల్, జిఆర్‌ఇ, డ్యూలింగో తదితర కోర్సులకు ఉచితంగా శిక్షణ అందిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో పద్మావతి కళాశాలలో ప్రత్యేక విదేశీ విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా లియో గ్లోబల్ ఓవర్సీస్ చైర్మన్ లగడపాటి శ్రీనివాస్‌కు పద్మావతి యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేసింది. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మాకేన సతీష్, కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

జాబ్‌మేళాకు స్పందన

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 63 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ మేళాలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఎంపికలను నిర్వహించారు. 63 మంది విద్యార్థులు మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఎంపికలకు 187 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపికైన వారిలో 32 మంది ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు విద్యార్థులను ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఎంపికైన వారు ఆయా కంపెనీల్లో మంచి ఉన్నతిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, జెకెసి కో-ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, డాక్టర్ వాణికుమారి, జిల్లా ఉపాధి అధికారి కొత్తంక సుధ, స్కిల్ డవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి వంశి పాల్గొన్నారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ఎచ్చెర్ల : మండలంలోని ఇబ్రహీంబాద్ సచివాలయం కార్యదర్శి అల్లాడ కేశవరరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపిడిఒ రమాదేవి మంగళవారం తెలిపారు. గ్రామంలో ఆరుగురు వ్యక్తులు వికలాంగ నకిలీ ధ్రువపత్రాలతో పింఛను పొందుతున్నారని, వారిని వైద్యులు అనార్హులుగా ధ్రువీకరించడంతో పింఛన్లు నిలుపుదల చేయాలని గత నెల 25న తెలియజేశామని అన్నారు. కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈ నెల పింఛను అందజేయడంతో షోకాజ్ నోటీసులు అందజేశామని తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి పరిధిలోని ప్రయివేటు ఎలక్ట్రీషన్‌గా పనిచేసిన బొమ్మాళి బాలరాజు ఇటీవల విదాఘాతానికి గురై గాయపడ్డాడు. దీంతో జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందారు. మూడు రోజుల అనంతరం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి సంతబొమ్మాళి మండలం గొల్ల సీతాపురం. ప్రయివేటు ఎలక్ట్రీషియన్‌గా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, 18 నెలల పాప ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


బాలరాజు (ఫైల్)

ప్రేమ పేరుతో వంచన

రణస్థలం రూరల్ : మండలంలోని రావాడ పంచాయతీ ఉప్పివలసకు చెందిన లోడగల సూరి బాలికతో ప్రేమాయణం నడిపి వంచిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూరి అనే యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి దగ్గరయ్యాడు. దీంతో బాలిక గర్భందాల్చింది. ఈ విషయాన్ని ఆ బాలిక ఎవరికీ చెప్పలేదు. బాలిక శరీర ఆకృతిలో మార్పు రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించగా, బాలిక గర్భందాల్చిందని నిర్ధారించారు. అనంతరం బాలికకు నొప్పులు రావడంతో కవలలకు జన్మనించింది. బాలిక ఆరోగ్యం క్షీణించింది. శిశువులు ఐసిలో ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జె.ఆర్. పురం ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైత్రీ పోలీసు మృతి

ఆమదాలవలస : పోలీస్ స్టేషన్ పరిధిలో మైత్రీ విధానంలో విధులు నిర్వహిస్తున్న తెలుకుల గణేష్ (32) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. మందస మండలానికి చెందిన గణేష్ పట్టణంలోని బంగారం షాపుల వద్ద రాత్రి వేళలో గస్తీ కాస్తూ మైత్రీ విధానంలో విధులు నిర్వహిస్తూ ఉండేవాడని అన్నారు. కొద్ది రోజుల క్రితం జ్వరం బారిన పడడంతో ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్ దగ్గరకు తీసుకువెళ్లామని అన్నారు. మోతాదుకు మించి ఔషధాలు అందించడంతో మృతి చెందారని తల్లి తెలుకుల ద్రౌపది ఫిర్యాదు చేశారని, సిఐ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు.


గణేష్ (ఫైల్)


శుభ్రం చేస్తున్న ప్రొక్లెయినర్

పూడికల తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ సుభద్రాపురంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సుభద్రాపురంలో అపారిశుధ్యం అనే కథనం మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ కథనంపై ఉపసర్పంచ్ దేశెట్టి తిరుపతిరావు, కార్యదర్శి నల్లాన శ్రీనివాసరావుల ఆధ్వర్యాన ప్రొక్లెయినర్‌తో చెత్తా చెదారాలను, పొదలను తొలగించారు. కలువల్లోని పూడికలు తీయించి ట్రాక్టర్ సహాయంతో డంపింగ్ యార్డుకు తరలించారు. అలాగే కుళాయిలు, చేతిపంపులు వద్ద శుభ్రం చేయించి అనంతరం బ్లీచింగ్, సున్నం పౌడర్‌ను చల్లించారు. పారిశుధ్య పనులు మండల ప్రత్యేకాధికారి అనురాధ, ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ పారిశుధ్య పనులు చేపడుతున్నామని అన్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ సేవలు మరువలేనివి

చైర్మన్ గిరిబాబు


సన్మానిస్తున్న చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస


పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రెండోసారి 18 నెలలు విధులు నిర్వహించిన కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మున్సిపాలిటీకి చేసిన సేవలు మరువలేనివని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమిషనర్ కొవ్వూరుకు బదిలీ అయ్యారు. దీంతో మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా దుశ్శాలువ కప్పి, మెమోంటో సత్కరించారు. మాట్లాడుతూ ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ కరోనా సమయంలో తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రజల మన్ననలను పొందారన్నారు. ఆంధ్రాబ్యాంకు రోడ్డు ఆక్రమణలను తొలగించి యుద్ధప్రాతిపదికన రోడ్డును నిర్మించారని అన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ మున్సిపాలిటీలో రెండుసార్లు కమిషనర్‌గా చేసే అవకాశం దక్కిందన్నారు. కెటి రోడ్డు విస్తరణ, ఆంధ్రాబ్యాంకు ఆక్రమణలు తొలగింపు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిఇ కనకరాజు, ఎఇ అవినాష్, సిపిఒ అప్పలరాజు, మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామి, మహేష్, అమర్, బెహరా పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని విభాగాల్లో శిక్షణ

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకొనేందుకు వీలుగా అన్ని విభాగాలపై శిక్షణ, అవగాహన కల్పించేందుకు బోధిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షా ఆరంభ్ ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై సూచనలు చేశారు. రాబోయే పరీక్షలు సెమీస్టారు విధానంలో ఉంటాయని, అందుకు తగ్గట్టుగా విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు సబ్జెక్టులతో పాటు వివిధ పోటీ పరీక్షలు ఎదుర్కొనేలా ఉన్నత ఉద్యోగాలు పొందేవిధంగా వర్తమాన పరిస్థితులు రోజూ వివరించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీంతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, మెంటల్ ఎమిలిటీ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, క్రీడలు, లైబ్రేరీ వంటి సౌకర్యాలు వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణవతి, వి.మధు, లైబేరియన్ నర్సింహులు, దావన్యాసకులు హేమాచలం, ప్రసాద్ పాల్గొన్నారు.


బోధిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

సంక్షిప్త వార్తలు

90 రోజులు పాల్గొన్న కూలీలకు ప్రాధాన్యం

లావేరు: ఉపాధి హామీలో భాగంగాలో 90 రోజులు పనుల్లో పాల్గొన్న కూలీలకు ప్రాధాన్యత కల్పించాలని ఎపిడి లోకేష్ అన్నారు. మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం, ఫైలింగ్ స్ట్రేంచులు, కొండ దిగువ ప్రాంతాల్లో వర్షపు నీరు ఇంకెలా కందకాలు తవ్వడం పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 90 రోజులు పాల్గొన్న కూలిలకు వంద రోజులు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎపిఒ రెడ్డి సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తైక్వాండో మాస్టర్‌గా భాస్కర్

శ్రీకాకుళం అర్బన్ : ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో జిల్లాకు చెందిన కొమర భాస్కర్ మాస్టర్‌గా అర్హత సాధించారు. గత నెల 21 నుంచి 26 వరకు జార్కండ్ రాష్ట్రం రాంచీలో ఉన్న కేల్గాం స్టేడియంలో 112వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62వ ఫూండాన్ ఎగ్జామినర్ కోర్స్ నిర్వహించారు. ఈ కోర్సుకు ప్రపంచ తైక్వాండో హెడ్ క్వార్టర్స్ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకడమీ మాస్టర్ జైవన్ కాంగ్, తైక్వాండో మాస్టర్స్ యూనియన్ గ్రాండ్ మాస్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హాంగ్ కిట్లు హాజరయ్యారు. వారి పర్యవేక్షణలో జరిగిన కోర్సులో జిల్లాకు చెందిన తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కర్ పాల్గొన్నారు.

పెంటలో వన మహోత్సవం

జి.సిగడాం : మండలంలోని పెంటలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కూటమి నాయకులు పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ రక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మక్కా నారాయణరావు, మీసాల రమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా సంఘాలు కేవలం ఆర్థిక అంశాలకే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎపిఎం పైడి కూర్మారావు సూచించారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పొన్నాంపేటలో గాలాల హేమలత అధ్యక్షతన గ్రామ సంఘం నెలవారీ పాలకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలు సమావేశాల నిర్వహణ, పొదుపులు చేయడం, అవసరం మేరకు అప్పులు తీసుకొని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పారదర్శకంగా పుస్తక నిర్వహణతో పాటు సామాజిక అంశాలపై ఎక్కువగా మహిళలు శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, మురుగునీటి కాలువల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపయోగం వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వన సంరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించడం, ప్రకృతి వ్యవసాయం, పేరటి తోటల అభివృద్ధి, ఔషధ మొక్కల పెంపకం, ఆరోగ్యం, ఆడపిల్లల విద్య, పౌష్టికాహారం, జండర్ తదితర అందరికీ ఉపయోగపడే అన్ని అంశాల మీద సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ఆచరించాలన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం లీడర్లు కె.మీన, జి.భవాని, విఒఎ గాయత్రి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ రామప్పడు పాల్గొన్నారు.

వ్యాధుల తీవ్రతపై అప్రమత్తత


మాట్లాడుతున్న ఎంపిపి పద్మ

ప్రజాశక్తి- కవిటి

గ్రామాల్లో వ్యాధుల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి కడియాల పద్మ సూచించారు. రాజపురం ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది చురుగ్గా వ్యవహరించి రోగులను పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా రక్త నమూనాలు సేకరించి గ్రామస్తులకు సరైన సలహాలు, సూచనలు అందించాలన్నారు.

ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, డాక్టర్లు కె.శశిధర్, మౌనిక, వైసిపి నాయకులు ఎస్.కృష్ణారావు, వై.నీలయ్య, ఎన్ని అశోక్, లొట్టి సోమేష్, సిబ్బంది అభిమన్యు సోయి, బెందాళం శివప్రసాద్, కేశవరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిఎస్‌పి

రణస్థలం రూరల్ : ఇటీవల శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

'సీదిరి' వ్యాఖ్యలు సరికాదు

పలాస : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విపత్తులు ఎదుర్కొనే శక్తి ఉందని, అటువంటి చంద్రబాబుపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించడం సరికాదని టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడ ప్రాంతంలో వరద నీరు ముంచేస్తుంటే చంద్రబాబు రాత్రి, పగలు తేడా లేకుండా అక్కడే ఉండి సేవలు అందిస్తున్నారని అన్నారు. మాజీ సిఎం జగన్, మాజీ మంత్రి విమర్శించడం సరికాదన్నారు. ఇకనైనా విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మోహనరావు, ప్రభుదాస్, పోలాకి పాపారావు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఇచ్ఛాపురం : తను చదువుకున్న పాఠశాలకు రూ.40 వేలు విలువైన మైక్ సెట్‌ను అందించి బడి రుణం తీర్చుకున్న పూర్వ విద్యార్థికి పలువురు ప్రశంసలు కురిపించారు. మండలంలోని కొలిగాం ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి చైర్మన్ శ్రీకాంత్ మహంతి రూ.40 వేలు విలువైన మైక్ సెట్‌ను ప్రధానోపాధ్యాయులు నరేంద్ర పట్నాయక్‌కు మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు పద్మావతి, చంద్రవదన, రేణుక, అమిత, వాణి, పాపారావు, శ్రీనివాసరావు, బర్న ఉప్పాడ పాపా రావురెడ్డి, శ్రీనివాస్, ఫాల్గుణరావు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ పత్రాల పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వయంశక్తి సంఘాలకు ఇచ్చే రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి, గ్రామ సంఘం నుంచే ఇచ్చే సామాజిక పెట్టుబడి నిధి, బ్యాంకు ద్వారా ఇస్తున్న లింకేజీ రుణాలను పరిశీలించామని వెలుగు ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. వెలుగు కార్యాలయంలో పత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంత రుణం తీసుకుంటున్నారు, వచ్చే ఆదాయం వివరాలు ఏమిటి, నెలవారీ రుణం తిరిగి చెల్లింపు, వాయిదాలు ఎంతెంత చెల్లించాలి, ఈ తీసుకున్న రుణాలపై వడ్డీ ఎంత, సంఘ సమావేశాలు సక్రంగా నిర్వహిస్తున్నారా? పరిశీలించి పలు సూచనలు చేశామన్నారు. ఇప్పటి వరకు పొదుపులు, అంతర్గత అప్పులు తీసుకొని వాటిని తిరిగి అసలు వడ్డీతో చెల్లించే విధానం, దానిద్వారా సంఘం నిధిని పెంచుకునే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వయంశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


పత్రాలను పరిశీలిస్తున్న ఎపిఎం ప్రసాదరావు


కోటబొమ్మాళి : విద్యాసామగ్రిని అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు కానుకలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం మండలంలోని దంత ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మండల పార్టీ అధ్యక్షులు పాగోటి అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు నోట్ పుస్తకాలు, కాంపాస్ పెట్టెలు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు, కూటమి నాయకులు సోమేష్, అప్పలరాజు, రామారావు, శిమ్మ వెంకటరావు పాల్గొన్నారు.

పొందూరు: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు, జనసేన జిల్లా కార్యనిర్వాహన కమిటీ సభ్యులు గార బాబూరావు, చిత్తిరి రాంబాబు, గార అనీత్, కెళ్ల శ్రీను, కెళ్ల రాజశేఖర్, కెంబూరి రమణ, గార సాయికుమార్ పాల్గొన్నారు.


పొందూరు : పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు


అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం కృష్ణారావు

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

నందిగాం : విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన ఉండాలని మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. పాఠశాల ఆవరణలో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బెందాళం రత్నం అధ్యక్షతన న్యాయ అంశాలపై మంగళవారం కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రంకిడి రామారావు, దుంపా శ్రీనివాస్, గోవిందరాజు, త్రినాథరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మున్సిపాలిటీలో సిడిపిఒ నాగారాణి ఆధ్వర్యాన బోర వీధి, వడ్డివీధి, బొబ్బిలి వీధి, చాకలిపేట, మహంతివీధి, పొందరవీధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికారంపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండ శంకర్‌రెడ్డి, ధర్మరాజు, వైసిపి నాయకులు ఢిల్లీరావు, సూపర్‌వైజర్ బి.సుజాత, ఉష, రాజేశ్వరి పాల్గొన్నారు.

చవితి వేడుకలకు పటిష్ట చర్యలు

బూర్జ : వినాయక చవితి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్ఐ ప్రవళ్లిక సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు ముందస్తుగా పోలీసు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు, ఊరేగింపు తదితర కార్యక్రమాలపై సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవళ్లిక